సాక్షి
అనంతపురం
గురువారం । 30 । మే । 2024



మానవాకార.. ముక్కంటీశ్వరా

ఎక్కడైనా పరమేశ్వరుడు లింగాకారంలో దర్శనమిస్తాడు. కానీ, హేమావతిలో మాత్రం మానవాకారంలో కనిపిస్తున్నాడు. 8లో



నేడు ఆముదం విత్తనమేళా

రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఆముదం విత్తన మేళా నిర్వహిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.6°/24.3°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ఏపీ ఈసెట్, ఐసెట్ ఫలితాల విడుదల



అనంతపురం: ఏపీ ఈసెట్ -2024 పరీక్ష ఫలితాలు గురువారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో నిర్వహించే ఫలితాల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రా రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఏపీ ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తెలిపారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏపీ ఐసెట్-2024 ఫలితాలు గురువారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేయనున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేస్తారు. ఈ మేరకు ఏపీ ఐసెట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం అర్బన్: కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 225 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాటిని జేఎన్‌టీయూలోని హంపి హాస్టల్, కలెక్టరేట్, పోలీసు కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించాలన్నారు. ఓట్ల లెక్కింపు విజయవంతంగా పూర్తి చేసేందుకు అందరూ బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో రాళ్లు, కర్రలు, వంటివి లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 2న జిల్లాకు పరిశీలకులు వస్తారని, ఆలోగా పనులన్నీ పూర్తి చేయాలని చెప్పారు. కౌంటింగ్ సమయంలో డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో పురుగు నివారణ



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

యాడికి: లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ఏడీఏ వెంకటరాముడు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టిపై క్లోరైడ్‌ను పిచికారీ చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ముందుగా లోతు దుక్కులు చేసి ఒకేసారి పత్తి విత్తనాలు విత్తుకోవాలన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట తొలగించే వరకు వ్యవసాయ సిబ్బంది అండగా ఉంటారన్నారు. ఆర్‌బీకేల్లో నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ నాణ్యమైన విత్తనాన్ని అందిస్తామన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, భూసార పరీక్షలు, మేలైన విత్తన ఎంపిక తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆత్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి, కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ..

యాడికి మండలంలోని మూడు విత్తన, ఎరువుల దుకాణాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెంకట్ ఫర్టిలైజర్ దుకాణ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో పాటు విత్తనాలను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో విత్తన విక్రయాలను నిలిపివేయాలని డీఏఓ ఆదేశాలు జారీ చేశారు. విత్తన డీలర్లు ముందుగా యాడికి మండలంలోని రైతులకు విత్తనాలు సరఫరా చేసిన తర్వాతనే ఇతరత్రా రైతులకు అమ్ముకోవాలని స్పష్టం చేశారు.బిల్లులు కచ్చితంగా ఇవ్వాలన్నారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్ భాష, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లతో శ్రీకారం

- కౌంటింగ్‌కు శరవేగంగా ఏర్పాట్లు
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం
- పార్లమెంట్ 'పోస్టల్' ఓట్ల లెక్కింపునకు మూడు రౌండ్లు
- అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి నుంచి రెండు రౌండ్లు
- కౌంటింగ్‌కు పార్లమెంట్‌కు 100 మంది సిబ్బంది
- ఎనిమిది అసెంబ్లీలకు 170 మంది సిబ్బంది



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన చెక్క ట్రేను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు పక్కాగా నిర్వహించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. జేఎన్‌టీయూలో జరుగుతున్న ఏర్పాట్లను నిత్యం జిల్లా ఉన్నతాధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలిస్తున్నారు. సిబ్బందికి తగిన సూచనలు, ఆదేశాలు ఇస్తున్నారు. ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా ప్రక్రియ సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్క తేలాకే..

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు, అత్యవసర సేవల శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, వయసు 85 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులు తదితరులు 22,456 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం ఇప్పటికే చేపట్టింది. పోలైన ఓట్లను అభ్యర్థుల వారీగా ఉంచేందుకు ప్రత్యేకంగా చెక్క ట్రేలను సిద్ధం చేసింది. అనంతపురం పార్లమెంట్‌కు సంబంధించి పోలైన 22,456 పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు 20 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు 34 టేబుళ్లు

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు మొత్తం 34 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తాడిపత్రి నియోజకర్గానికి 6 టేబుళ్లు, మిగిలిన వాటికి నియోజకవర్గానికి 4 టేబుళ్ల లెక్కన ఏర్పాటు చేస్తున్నారు. రాయదుర్గం నియోజవర్గానికి సంబంధించి 1,671 ఓట్ల లెక్కింపు ఒక రౌండ్‌లో పూర్తి చేస్తారు. ఉరవకొండకు సంబంధించి 2,544 ఓట్లను రెండు రౌండ్లలో, గుంతకల్లుకు సంబంధించి 3,612 ఓట్లను రెండు రౌండ్లలో, తాడిపత్రికి సంబంధించి 2,702 ఓట్లను ఒక రౌండు, శింగనమలకు సంబంధించి 2,450 ఓట్లను రెండు రౌండ్లలో, అనంతపురం అర్బన్‌కు సంబంధించి 6,971 ఓట్లను నాలుగు రౌండ్లలో, కళ్యాణదుర్గానికి సంబంధించి 2,614 ఓట్లను రెండు రౌండ్లలో, రాప్తాడు నియోజవర్గానికి సంబంధించి 4,338 ఓట్ల లెక్కింపును మూడు రౌండ్లలో పూర్తి చేస్తారు.

270 మంది సిబ్బంది నియామకం

అనంతపురం పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు 270 మంది సిబ్బందిని నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అడిషనల్ ఏఆర్‌ఓలు 20 మంది, కౌంటింగ్ సూపర్‌వైజర్లు 20 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 40 మంది, సూక్ష్మ పరిశీలకులు 20 మంది మొత్తం 100 మందిని నియమించారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకర్గాల పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు అడిషనల్ ఏఆర్‌ఓలు 34 మంది, సూపర్‌వైజర్లు 34 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 68 మంది, సూక్ష్మ పరిశీలకులు 34 మందిని నియమించారు.

పార్లమెంట్ నియోజకవర్గం	పోలైన పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు
అనంతపురం	22,456	20	3

అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నియోజకవర్గం	పోలైన పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	1,671	4	1
ఉరవకొండ	2,544	4	2
గుంతకల్లు	3,612	4	2
తాడిపత్రి	2,702	6	1
శింగనమల	2,450	4	2
అనంతపురం	6,971	4	4
కళ్యాణదుర్గం	2,614	4	2
రాప్తాడు	4,338	4	3

కౌంటింగ్‌కు సన్నద్ధంగా ఉన్నాం

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని ఈసీఐ డిప్యూటీ ఎలెక్షన్ కమిషనర్(డీఈసీ) నితీష్‌వ్యాస్‌కు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ సన్నద్ధతపై డీఈసీ బుధవారం న్యూఢిల్లీ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌతమిశాలి, జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై డీఈసీకి కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు చేపట్టిన ఏర్పాట్లపై అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, పార్టీల ప్రతినిధులకు తెలియజేశామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఒక విడత శిక్షణ ఇచ్చామని, జూన్ 2వ తేదీన రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ విజయవంతంగా నిర్వహించేందుకు సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత అమలు చేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి హింస చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొబైల్ పికెట్స్, నైట్ పెట్రోలింగ్ విస్తృతం చేశామన్నారు. రౌడీషీటర్లను గుర్తించి బైండోవర్ చేశామని చెప్పారు. పోలింగ్, ఆ తరువాత చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో తాడిపత్రి పట్టణంలో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు.

సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలి



ఆత్మకూరు మండల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

ఆత్మకూరు: సమస్యాత్మక గ్రామాలను తరచూ సందర్శించాలని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, తాజా పరిస్థితులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు సృష్టించే వారిని త్వరితగతిన బైండోవర్ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పెట్రోలింగ్‌లు, కార్డెన్ సెర్చ్‌లు విస్తృతం చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు, ఆ తర్వాత గ్రామాల్లో హింసకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మునీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రోన్ ఆపరేటింగ్‌పై సిబ్బందికి ప్రత్యేక తర్ఫీదునిచ్చినట్లు పేర్కొన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ముందస్తుగా పసిగట్టేందుకు డ్రోన్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తాడిపత్రి, అనంతపురం రూరల్ సబ్ డివిజన్లలో డ్రోన్ కెమెరాల పెట్రోలింగ్ ప్రారంభించామన్నారు. ఘర్షణల కోసమని ఎక్కడైనా మిద్దెలపై రాళ్లు, కట్టెలు సమీకరించుకున్నారా అనే విషయం పసిగడుతున్నామన్నారు. గ్రామాల్లో అనుమానితుల సంచరింపు, ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెదిరింపులు, కవ్వింపు చర్యలు, వైరి వర్గాలు తలపడటం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అణచి వేస్తామన్నారు. 144 సెక్షన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బడి బస్సులు భద్రమేనా?

- మరికొన్ని రోజుల్లో పాఠశాలల పునఃప్రారంభం
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం ఆర్టీఏ కార్యాలయానికి బస్సుల క్యూ
- నిబంధనలు పాటించకున్నా సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు
- పిల్లల భవిష్యత్తును పణంగా పెడుతున్నారంటూ సర్వత్రా విమర్శలు



ఆర్టీఏ కార్యాలయానికి ఎఫ్‌సీ కోసం వచ్చిన స్కూల్ బస్సు

అనంతపురంలోని ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం గతేడాది ఓ బస్సు కొనుగోలు చేసింది. గతంలో ఈ బస్సును ఆర్టీసీలో అద్దెకు నడిపారు. ఫిట్ లేకపోవడం, తరచూ మొరాయిస్తుండడంతో అక్కడ అధికారులు తిరస్కరించారు. దీంతో సదరు బస్సు యజమాని ఓ ప్రైవేటు స్కూల్‌కు అతి తక్కువ ధరకు దీన్ని విక్రయించారు. రెండేళ్లుగా బస్సును విద్యార్థులను తరలించేందుకు వాడుతున్నారు. కనీసం స్కూల్ విద్యార్థులకు అనువుగా కూడా మార్పు చేర్పులు చేయలేదు. కేవలం పెయింటింగ్ మార్చి వాడుతున్నారు. ఆర్టీఏ అధికారులు మాత్రం కాలపరిమితి చూసి ఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందిస్తున్నారు. ఈ సారి కూడా 'మూమూలు'గానే సర్టిఫికెట్ ఇచ్చేశారు. జిల్లాలోని చాలా స్కూల్ యాజమాన్యాలు ఇలాంటి బస్సులనే వాడుతున్నా, అధికారులు చూసీ చూడనట్లు పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనంతపురం సెంట్రల్: మరికొన్ని రోజుల్లో బడి గంట మోగనుంది. ఈ క్రమంలోనే ఈ నెల 15వ తేదీతో బడి బస్సుల ఎఫ్‌సీ పూర్తి కావడంతో రెన్యూవల్స్ కోసం అనంతపురం ఆర్టీఏ కార్యాలయానికి క్యూ కడుతున్నాయి. అయితే, ప్రైవేటు యాజమాన్యాలన్నీ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాయా, ఆర్టీఏ అధికారులు అన్నింటినీ సరిగానే పరిశీలిస్తున్నారా అంటే? కాదనే సమాధానమే వినిపిస్తోంది. 50 శాతం 'ప్రైవేటు' బస్సుల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదు. చాలా మటుకు డొక్కు బస్సులనే వినియోగిస్తున్నారు.

కనీస ప్రమాణాలు పాటించని వైనం

చిన్నారులను తరలించే బస్సులు మంచి కండీషన్‌లో ఉండాలి. నిష్ణాతులైన డ్రైవర్లతో పాటు అత్యవసర తలుపులు, ఫస్ట్ ఎయిడ్‌కిట్‌లు ఉంచుకోవాలి. పరిమితికి లోబడే సీటింగ్ కెపాసిటీ ఉండాలి. కానీ జిల్లాలో ఎక్కువశాతం మంది ఈ నిబంధనలు పాటించడం లేదు. చాలా స్కూల్ యాజమాన్యాలు తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు తెప్పించుకొని వినియోగిస్తున్నారు. వీటికి కాల పరిమితి ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా బస్సులను వాడుతుండడంతో తగిన కండీషన్‌లో ఉండడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 732 బస్సులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులో 383 బస్సులు మాత్రమే 7 సంవత్సరాలలోపు ఉన్నాయి. మిగిలినవన్నీ దీర్ఘకాలికంగా వాడుతున్నవే. నిబంధనల ప్రకారం ఇలాంటి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వకూడదు. కానీ ఆర్టీఏ అధికారులు మాత్రం చూసీచూడనట్లు పాస్ చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే ఎవరిని బాధ్యులను చేయాలో అర్థం కాని పరిస్థితి. పిల్లలను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. నిబంధనలు పాటిస్తుంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాం. కాలం చెల్లిన బస్సులకు ఎట్టి పరిస్థితిల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. భవిష్యత్తులో విద్యార్థులను తరలించే సమయంలో కూడా స్కూల్ బస్సులపై శ్రద్ధ తీసుకుంటాం. ఎక్కువ మంది విద్యార్థులను తరలిస్తున్నా, నిబంధనలు పాటించకపోయినా కేసులు నమోదు చేసి బస్సు సీజ్ చేస్తాం.
– వీర్రాజు, ఉపరవాణా కమిషనర్

కొత్త వంగడాలపై దృష్టి సారించండి



వేరుశనగ మొలక శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం అగ్రికల్చర్: వేరుశనగలో కొత్త వంగడాలను సృష్టించి జిల్లా రైతులకు పరిచయం చేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానికంగా ఉన్న విజయ అగ్రోసీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. విత్తన శుద్ధి, నాణ్యత, మొలకశాతం, తేమశాతం, అవుటన్ తదితర ప్రమాణాలను పరిశీలించారు. 30 కిలోల బస్తా తూకాలు, నాణ్యతా ప్రమాణాల గురించి ఏడీఏ ఎం.రవి కలెక్టర్‌కు వివరించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా రైతులకు మంచి విత్తనం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే నెలలో కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం, అలాగే కర్ణాటకలో ఉన్న పరిశోధనా కేంద్రాలను సందర్శించి కొత్త వంగడాల పరిశోధనలు, వాటి ఫలితాల ఆధారంగా ముందడుగు వేయాలన్నారు. వేరుశనగ రకాలకు ప్రసిద్ధిగాంచిన గుజరాత్ రాష్ట్రం జునాఘడ్‌కు జిల్లా నుంచి ఒక బృందం పంపడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక ఏడీఏ, ఇద్దరు ఏఓలు, ఒక శాస్త్రవేత్తతో కూడిన బృందాన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు పి.సోమశేఖర్, సాయిలక్ష్మి తదితరులున్నారు.

విహార యాత్రలో విషాదం



సురేష్ రావు(ఫైల్)

అనంతపురం: విహార యాత్రలో విషాదం నెలకొంది. చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన నగర వాసి ఒకరు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గంగోత్రి వద్ద కన్నుమూశారు. వివరాలు.. నగరంలోని చంద్ర హాస్పిటల్ వద్ద హనుమంతకారి సురేష్ రావు (64) తన భార్య సుమిత్రభాయ్, కుమారుడు సోను, కుమార్తె సునామాతో కలిసి నివాసం ఉంటున్నారు. మున్సిపల్ కాంట్రాక్టర్ అయిన ఈయన వారం క్రితం కుటుంబంతో కలిసి ఓ టూరిస్ట్ బస్సులో చార్‌ధామ్ యాత్రకు వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున గంగోత్రి సమీపంలో ఆక్సిజన్ అందక ఇబ్బంది పడ్డారు. కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు ఉత్తర కాశీలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పలువురు ఆరెకటిక సామాజికవర్గానికి చెందిన నాయకులు నగరంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్కేయూ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ చౌడోజీరావు, లక్ష్మీనారాయణ, మల్లిఖార్జున, సాయినాథ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- విత్తన దుకాణాల్లో రెండో రోజూ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- రూ.42 లక్షల విలువైన విత్తన అమ్మకాల నిలిపివేత



శ్రావణి సీడ్స్ గోడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ సోమశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతపురం సబ్ డివిజన్ ఏడీఏ ఎం.రవి హెచ్చరించారు. బుధవారం ఆయన గార్లదిన్నె ఏఓ పి.సోమశేఖర్, ఏఈఓ మురళీకృష్ణతో కలిసి స్థానిక బస్టాండ్ సమీపంలో శ్రావణి సీడ్స్, సుధాకర్, శ్రీలేఖ, మనగ్రోమోర్ తదితర విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా శ్రావణి సీడ్స్ గోదాములో నిల్వ ఉంచిన రూ.42 లక్షల విలువ చేసే కర్బూజా, కళింగర, మిరప విత్తనాల అమ్మకాలు నిలిపివేస్తూ (స్టాప్ సేల్స్) ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల్లో వాటికి సంబంధించి రికార్డులు సమర్పించకుంటే సీజ్ చేయడంతో పాటు 6–ఏ కేసు నమోదు చేస్తామన్నారు. దుకాణాల్లో రైతులకు పూర్తి వివరాలతో కూడిన ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని, ధరల పట్టిక ఉండాలని, ఎంఆర్‌పీకి మించి అధికంగా విక్రయాలు చేపట్టడం, నిబంధనలకు విరుద్ధంగా కల్తీ, నాసిరకం, నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలు సాగించినా క్రిమినల్ కేసులతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా పురుగు మందులు అంటగట్టడం, డిమాండ్ సృష్టించి అధిక ధరలు, బిల్లులు లేకుండా అమ్మడం లాంటివి చేస్తే కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భయపెట్టి.. పరుగెత్తి

బొమ్మనహాళ్:మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బుధవారం ఓ ఎలుగుబంటి కలకలం రేపింది. తెల్లవారుజామున గ్రామంలోకి వస్తున్న ఎలుగుబంటిని కుక్కలు తరమడంతో సమీపంలోని చెట్టు ఎక్కింది. గమనించిన స్థానికులు బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులు, రాయదుర్గం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆ ప్రాంతంలో గుమిగూడడంతో భల్లూకం భయపడి చెట్టుపైనే కూర్చుంది. కొంత సేపటికి అక్కడికి చేరుకున్న అధికారులు.. జేసీబీని తెప్పించి చెట్టును అదిలించగా, కిందపడిన భల్లూకం పరిగెత్తి వెళ్లి మరో చెట్టుపైకి ఎక్కింది. కొంత సేపటికే కిందికి దిగి గ్రామ శివారులో ఉన్న కొండలోకి పరుగు తీసింది. కొన్ని రోజులుగా ఉంతకల్లు సమీపంలో ఎలుగుబంట్ల సంచారం పెరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఎలుగుబంట్లను అడవిలో వదిలిపెట్టాలని వారు కోరుతున్నారు.



జేసీబీ సహాయంతో చెట్టును అదిలిస్తున్న దృశ్యం



పరుగు తీస్తున్న ఎలుగుబంటి

క్లుప్తంగా

శ్రీగంధం అలంకరణలో నెట్టికంటుడు



గుంతకల్లు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమద్ జయంతి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శ్రీగంధం అలంకరణలో నెట్టికంటుడు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి తమలపాకుల లక్షార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

యువకుల మధ్య ఘర్షణ

గుత్తి: పట్టణంలోని టమాట మార్కెట్‌లో మంగళవారం అర్ధరాత్రి యువకుల మధ్య ఘర్షణ జరిగింది. బోయ మధు, అతని సోదరుడు భాస్కర్ మద్యం సేవిస్తున్న సమయంలో కిరణ్ అనే యువకుడు వారి వద్దకు వెళ్లి అకారణంగా గొడవ పెట్టుకున్నాడు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. కిరణ్ .. బోయ మధుపై మద్యం బాటిల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మధును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శిగా రఫీక్



అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శిగా యూ.మహమ్మద్ రఫీక్ ఎన్నికయ్యారు. బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర నూతన జనరల్ కౌన్సిల్ సమావేశం కృష్ణా జిల్లా గుడివాడలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా రఫీక్‌ను నియమిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

మానవాకార.. ముక్కంటీశ్వరా

- శిల్పకళలకు నిలయం 'హేమావతి'
- కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా సిద్ధేశ్వరుడు
- 14 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ సముదాయం

దేశంలో ఎక్కడా లేని విధంగా మానవ రూపంలో పరమేశ్వరుడు దర్శనమిస్తున్న ఏకైక దివ్యక్షేత్రం హేమావతి. కోరిన కోర్కెలు తీర్చే దైవం హెంజేరు సిద్ధేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు నిత్యం పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. శిల్పకళలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని సందర్శించి మంత్ర ముగ్ధులవుతుంటారు.



మానవ రూపంలో దర్శనమిస్తున్న సిద్ధేశ్వరుడు



హేమావతిలోని గర్భగుడి



ఐదు అడుగుల ఎత్తున్న నందీశ్వరుడు

హేమావతి (అమరాపురం): ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో ఉంది. ఇక్కడ హెంజేరు సిద్ధేశ్వరస్వామి మానవ ఆకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. చతుర్భుజాలలో శంఖు, చక్ర, త్రిశూల, డమరుకాలు కలిగి అభయహస్తంతో భక్తులను ఆశీర్వదిస్తుంటారు. శ్మశానవాసుడైన భోళా శంకరుడు అందుకు ప్రతీకగా కపాలాల మాల ధరించి ఉంటారు. మూర్తిని అత్యంత అద్భుతంగా చెక్కారు.

నేడు కుగ్రామం.. నాడు రాజధాని..

శిల్పకళలకు నిలయంగా ఉన్న హేమావతి సుప్రసిద్ధ ప్రాచీన శైవక్షేత్రం. అమరాపురం మండలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. హేమావతి ప్రస్తుతం ఓ కుగ్రామం. అయినప్పటికీ క్రీ.శ.720లో నోళంబ రాజ్యానికి రాజధానిగా వెలుగొందడమే కాకుండా ఎన్నో కీర్తి ప్రతిష్టలను ఆర్జించింది. హేమావతి చారిత్రక పేరు హెంజేరు. అనతికాలంలో హైమావతిగా రూపాంతరం చెంది ప్రస్తుతం హేమావతిగా పిలువబడుతోంది. హేమావతిని రాజధానిగా చేసుకొని నొళంబరాజులైన మంగశరాజే మొదటిగా పాలించిన రాజుగా చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ.720లో నొళంబ రాజులకు సామంతులైన పల్లవుల రాజైన త్రినయ పల్లవ (సింహవిష్ణువు) అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం, ధార్వాడ, తుమకూరు, తమిళనాడులోని ధర్మపురి, సేలం జిల్లాలను కలుపుకొని రాజ్యపాలన చేశారని శిలాశాసనాలు చెబుతున్నాయి.

14 ఎకరాల విస్తీర్ణంలో...

హేమావతిలోని హెంజేరు సిద్ధేశ్వరస్వామి ఆలయ సముదాయం శిల్ప కళలకు నిలయంగా మన్ననలు అందుకుంటోంది. హేమావతి గ్రామం నడిబొడ్డున సువిశాలమైన 14 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ సముదాయం, పార్కుతో భక్తులను కనువిందు చేస్తోంది. ప్రధానంగా సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన వెంటనే మహాద్వారంలోనే సిద్ధేశ్వరస్వామి విగ్రహం ఉన్న ఆలయం కనిపిస్తుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా శివుడు లింగరూపంలో కాకుండా మానవాకారంలో ఉండడంతో ఈ ప్రాంతం భక్తులకు, యాత్రికులకు ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఐదు అడుగుల మూడు అంగుళాల ఎత్తున్న ఇలాంటి విగ్రహం దేశంలోని ఏ శివాలయాల్లో లేదని, అన్ని ఆలయాల్లో శివుడు లింగరూపంలోనే ఉన్నాడని చరిత్రకారులు చెబుతున్నారు.

సూర్యకిరణాలు స్వామివారిపై...

సిద్ధేశ్వరాలయంలో శ్రావణ, కార్తీక మాసాల్లో సూర్యుడు అస్తమించే సమయంలో సూర్యకిరణాలు స్వామివారి ముఖంపై పడటం మరో విశేషంగా చెప్పవచ్చు. ఈ ఆలయ ముఖ ద్వారానికి ముందు భాగాన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభానికి కుడివైపున అగ్నిగుండం, ఎడమ వైపున ఆస్థానం ఏర్పాటు చేశారు.

పొలిమేరల్లో అక్కమ్మ ఆలయం..

గ్రామ పొలిమేరల్లో అక్కాచెల్లెళ్ల ఆలయం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకొంటోంది. ఇక్కడ లభ్యమైన కొన్ని విగ్రహాలు చెన్నై, కర్ణాటకలోని చేలూరు మ్యూజియంకు తరలించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వారు ఇక్కడ మ్యూజియం నిర్మాణం చేయడంతో ఇక్కడి పొలాల్లో పెద్దఎత్తున లభ్యమైన విగ్రహాలను పురావస్తుశాఖ వారు నిర్మించిన మ్యూజియంలో భద్రపరచడమేకాక వాటి వివరాలను సైతం భక్తులకు అందుబాటులో ఉంచారు.

పర్యాటకుల సందడి

ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చి సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. ముఖ్యంగా మహా శివరాత్రి సందర్భంగా వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అలాగే శ్రావణమాసం, కార్తీకమాసంలో వివిధ రకాలుగా భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఈ గ్రామానికి పర్యాటకులు వస్తే పంచలింగాలను దర్శనం చేసుకోవచ్చు.

చిత్రాలతో కనువిందు..

దొడ్డేశ్వర ఆలయం ఈ ఆలయ ప్రాంగణంలోనే ఉంది. ఆలయంలో పెద్దఎత్తున శివలింగం చూపరులకు కనువిందు చేస్తోంది. ఈ ఆలయం రాతి స్తంభాలచే నిర్మితమైంది. అన్ని స్తంభాలపైన మలచిన రామాయణం, భాగవత దృశ్యాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆయా గాథలు జరిగిన తీరును శిల్పాల ద్వారా చిత్రీకరించారు. ఈ ఆలయం ముందు భాగాన ఐదు అడుగుల ఎత్తు, పొడవున్న నందీశ్వరుని విగ్రహం ఉంది. ఈ విగ్రహం చెవుల్లో వజ్రాలు పొదిగారనే నెపంతో దుండగులు చాలా సంవత్సరాల క్రితం చెవులను ధ్వంసం చేశారు. 80 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు ఉన్న దొడ్డేశ్వర ఆలయ ప్రాంగణంలో ఘటిక స్థానం విద్యాకేంద్రంగా ఉండేదని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఘటిక స్థానంలో శిక్షణ తీసుకొన్న వారు కంచిపీఠం తదితర ప్రాంతాలకు వెళ్లి తమ పాండిత్యాన్ని ప్రదర్శించేవారని తెలుస్తోంది.

సిద్ధేశ్వరుడు మహిమాన్వితుడు



దేశంలో ఎక్కడాలేని విధంగా హేమావతిలో మానవరూపంలో శివుడు దర్శనం ఇస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులకు స్వామి వారిని ఏది కోరుకుంటే అది ప్రసాదిస్తాడనే నమ్మకం ఉంది. ఇక్కడ పంచలింగేశ్వర దర్శనం కూడా చేసుకోవచ్చు. విరూపాక్షేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, సిద్ధేశ్వర స్వామి అలాగే సిద్ధేశ్వరస్వామి చెల్లెలు నవకోటమ్మను దర్శించుకోవచ్చు.

– సిద్ధలింగేశ్వరస్వామి, అర్చకుడు, హేమావతి


ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ ఎన్నికల కమిషన్ పక్షపాతంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఒక ప్రకటనలో మండిపడ్డారు. దేశమంతా ఎన్నికల నిబంధనలు ఒక విధంగా ఉంటే ఏపీలో మాత్రం ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తోందన్నారు. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల కమిషన్ కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో పాటు సీల్ ఉండాలని నిబంధన ఉందని, గెజిటెడ్ ఆఫీసర్ ఆర్వో సంతకం లేకుండా అనుమతించమని ఏపీ ఎన్నికల కమిషన్ నిబంధనలను సడలించడం బాధాకరమన్నారు. ఈ సడలింపు కూటమికి మేలు చేసే విధంగా ఉందన్నారు. నిబంధన సడలింపును పునః సమీక్షించాలని కోరారు. తెలుగుదేశం కూటమి ఎన్ని అక్రమాలు చేసి అయినా అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ సమయంలో గట్టిగా వ్యవహరించాలని కోరారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా కచ్చితంగా వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందన్నారు. మరోసారి వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

మయూర వాహనంపై వేంకటరమణుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. 10వ రోజు బుధవారం శ్రీవారి వసంతోత్సవం, మయూర వాహనోత్సవ సేవలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు తర్వాత స్వామి వారి వసంతోత్సవం, కంకణ విసర్జన, చక్రస్నానం, మహా మంగళహారతిని వేడుకగా జరుపుకున్నారు. ఉదయం స్వామి వారి వసంతోత్సవాన్ని దేవాలయం వద్ద నుంచి లక్ష్మీబజార్‌కు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై శ్రీవారిని పురవీధుల్లో ఊరేగించారు. విశ్వ హిందూ పరిషత్, రజక సంఘం, వడ్డెర్ల సంఘం, హరిజన సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి మయూర వాహన సేవ కొనసాగింది. చివరి రోజు గురువారం సప్తప్రాకారోత్సవం, శయనోత్సవ కార్యక్రమాలతో శ్రీవారి ఉత్సవాలు ముగిస్తాయని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.




మయూర వాహనంపై ఊరేగుతున్న వేంకటరమణస్వామి

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం ఉదయం పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ బి.వినూత్న తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఇక.. జిల్లా వ్యాప్తంగా ఉదయం జరిగిన మొదటి సంవత్సర పరీక్షలకు జనరల్ విద్యార్థులు 8,689 మందికి గాను 8,324 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 427 మందికి గాను 408 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సర పరీక్షలకు జనరల్ విద్యార్థులు 2,154 మందికి 2,058 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 95 మందికి 91 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 5 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 5 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 4 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఓట్ల లెక్కింపుపై కలెక్టర్ సందేశం



కలెక్టర్ రూపొందించిన సందేశాత్మక చిత్రం

అనంతపురం అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ సందేశంతో కూడిన చిత్రాన్ని రూపొందించారు. అదే విధంగా హెల్ప్‌లైన్ 08554-234122 అందుబాటులోకి తెచ్చారు.

సందేశం ఇలా...

శాంతియుత అనంతపురం – ప్రజాస్వామ్యానికి కళాఖండం... ''శిల్పంగా మారేందుకు శిల ఒక శిల్పి ఉలికి ఎలా దూరంగా వేచి ఉంటుందో... ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా అలానే సూక్ష్మంగా ఉంటుంది. ప్రజాస్వామ్య కళాఖండాన్ని చూడడానికి మనకు సహనం అవసరం.''

24 నుంచి ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీసింగ్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో జూన్ 24 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9618876060, 8309915577, 9440905479, 08554-255925 నంబర్లను సంప్రదించాలన్నారు.

బాస్కెట్ బాల్ శిక్షణకు ఎంపిక



ద్వారకనాథరెడ్డి

అనంతపురం: నేషనల్ బాస్కెట్ బాల్ శిక్షణకు అనంతపురం నగరానికి చెందిన ద్వారకనాథరెడ్డి ఎంపికయ్యారు. జూన్ 6 నుంచి జులై 6వ తేదీ వరకు ఇండోర్‌లో జరిగే శిక్షణ శిబిరంలో అతను పాల్గొననున్నాడు. ఇందులో ప్రతిభ చాటితే భారత జట్టుకు ఎంపిక చేస్తారు. ఇటీవల జరిగిన అండర్ –18 జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇవ్వడంతో ద్వారకనాథరెడ్డి ఈ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు.

యేసయ్యను విశ్వసిస్తే అన్నీ శుభాలే



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్



మహిమ సువార్త మహా సభలకు హాజరైన దేశ, విదేశాల ప్రతినిధులు, భక్తులు

- బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్

గుత్తి: 'విశ్వంలో అత్యంత మహిమాన్వితుడు యేసు ప్రభువు. ఆయన్ను అందరూ విశ్వసించాలి. ప్రార్థించాలి. యేసయ్యను విశ్వసిస్తే అన్నీ శుభాలే జరుగుతాయి' అని బైబిల్ మిషన్ చర్చి (స్వస్థత శాల) పాస్టర్లు రెవరెండ్ అద్భుతకుమార్, మణికుమారి అన్నారు. గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో బుధవారం మహిమ సువార్త మహాసభలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖ పాస్టర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ప్రముఖ పాస్టర్లు డాక్టర్ జాన్ సెర్మన్ సిపాయుంగ్, సెమరాంగ్ థామస్ (ఇండోనేషియా), జాన్ బ్రిట్టో (సింగపూర్), డాక్టర్ ప్రకాష్ డేనియల్(అమెరికా–ఫ్లోరిడా), కృపాకర్(తమిళనాడు), శామ్యూల్ భలే రావు(సికిందరాబాద్), తిమోతి రాజ్ (తెలంగాణ) హాజరైయ్యారు. ఈ సందర్భంగా అద్భుత్‌కుమార్, మణి కుమారి వేలాది మంది భక్తులు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ యేసయ్యపై విశ్వాసం, నమ్మకం ఉంచాలన్నారు. సృష్టిలో యేసయ్యకు మించిన దేవుడు లేడన్నారు. అనంతరం సంగీత మహోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

డీపీఓను ప్రారంభించిన డీఆర్ఎం



డీపీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో ఆధునీకరించిన సీనియర్ డివిజనల్ పర్సనల్ బ్రాంచ్ కార్యాలయాన్ని డీఆర్ఎం వినీత్‌సింగ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహన్, డీఆర్ఎం సతీమణి. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు అంజినీ సింగ్ తదితరులు హజరయ్యారు. దాదాపు రూ.50 లక్షలతో ఆధునీకరించిన కార్యాలయంలో అధికారుల రూమ్‌లతో పాటు ఫర్నీచర్, ఇతర్రత మౌళిక సదుపాయాలు కల్పించారు.

నేడు 'ఆముదం' విత్తన మేళా

అనంతపురం అగ్రికల్చర్: ఆముదం పంట అంశంపై గురువారం బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో 'విత్తన మేళా' ఏర్పాటు చేసినట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత నూనెగింజల పరిశోధనా స్థానం (ఐసీఏఆర్), ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ ప్రాజెక్టు ఆన్ క్యాస్టర్ (ఆముదం) కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆముదం రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి ఉంటుందన్నారు.

449 మంది బైండోవర్

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు బుధవారం 449 మందిని బైండోవర్ చేశారు. 138 మంది ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది వరకే కేసులు ఉండటంతో పాటు ఈ ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడిన 8 మందిపై బుధవారం కొత్తగా రౌడీషీట్ ఓపెన్ చేశారు. జిల్లాలో ఐదు చోట్ల సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యం నింపడం, పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచేందుకు 16 చోట్ల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

అశ్వవాహనంపై విహరించిన నృసింహుడు



అశ్వవాహనంపై విహరిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ: పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారసింహుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనిమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామిలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

పెద్దవడుగూరు: రైతులు పత్తి, వేరుశనగ, మిరప పంటలతో పాటు చిరుధాన్యాలను కూడా సాగు చేయాలని డీఆర్‌సీ మద్దిలేటి, వెటర్నరీ సైంటిస్ట్ మాధవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివ కుమార్, ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్బీకే కేంద్రంలో ఖరీఫ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంటలు సాగు చేసిన తరువాత ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడటం వలన కలిగే నష్టాలను వివరించారు.

క్లుప్తంగా

హనుమజ్జయంతికి సర్వం సిద్ధం



అనంతపురం కల్చరల్: హనుమజ్జయంతి వేడుకలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నగరంలోని హౌసింగుబోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో నేత్రపర్వంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. నేడు గోపూజ, ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు నిర్విరామ అఖండ రామభజన ఉంటుంది. 31న భక్తాంజనేయ మూలమూర్తికి పంచామృతాభిషేక సేవలు, సామూహిక హనుమద్ వ్రతం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయి. జూన్ ఒకటిన హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అన్నదానం నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు సత్సంగం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని శ్రీసద్గురు వలీస్వామి ఆశ్రమంలో గురువారం భగవాన్ రమణ మహర్షి సత్సంగం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు అనంత ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో పాలసముద్రం నాగరాజు బృందం భక్తిగీతాలను ఆలపిస్తుందని పేర్కొన్నారు.

రైతులందరికీ విత్తన వేరుశనగ



చెన్నేకొత్తపల్లి ఆర్బీకేలో విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, ఏఓ తదితరులు

చెన్నేకొత్తపల్లి: రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులందరికీ విత్తన వేరుశనగ అందిస్తామని ఎంపీడీఓ మోహన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మండల పరిధిలోని పది రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాలకు 1,300 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ కాయలు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకూ 1,316 మంది రైతులు 1,170 క్వింటాళ్ల విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. వీరందరికీ విత్తనం పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. వేరుశనగ పంటలో అంతర పంటగా కంది సాగుచేసుకోవచ్చని, కంది విత్తనం కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

విత్తన వేరుశనగ దుర్వినియోగం చేస్తే చర్యలు



గంతిమర్రి ఆర్బీకే వద్ద రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ, ఇతర సిబ్బంది

రామగిరి(చెన్నేకొత్తపల్లి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కాయలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంతిమర్రి రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాయితీ ద్వారా తీసుకున్న విత్తన వేరుశనగ కాయలను రైతులు విక్రయించినా, దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గంతిమర్రి ఎంపీఈఓ రామ్మోహన్, కలికివాండ్లపల్లి రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ



యోగా చేస్తున్న చిన్నారులు

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. 15వ రోజైన బుధవారం యోగా, డ్రాయింగ్, కథలు, పద్యాలు చెప్పడం, పుస్తక పఠనం, డ్యాన్స్‌పై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, సహాయ గ్రంథాలయాధికారి ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, ముత్యాలమ్మ, ఉజ్జినేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పని చేయించుకుని..పైసలివ్వలేదు!

- ఈవీఎంల ఎఫ్ఎల్‌సీకి 100 మంది సేవలు
- ఆరు నెలలైనా భత్యం ఇవ్వని వైనం
- కలెక్టరేట్ ఎన్నికల విభాగం నిర్వాకం

అనంతపురం అర్బన్: ఎన్నికలకు సంబంధించి సిబ్బంది ఎలాంటి విధులు నిర్వర్తించినా అందుకు రెమ్యునరేషన్ (భత్యం) ఇస్తారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్‌ను ఇస్తుంది. అయితే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) విధులను దాదాపు 100 మంది సిబ్బంది నిర్వర్తించారు. ఆరు నెలలైనా వీరికి రెమ్యునరేషన్ మాత్రం ఇవ్వలేదు. ఈ విషయం గురించి ఎన్నికల విభాగం అధికారులు కనీసంగా కూడా పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను గత ఏడాది అక్టోబరు 16వ తేదీ నుంచి నవంబరు 10వ తేదీ వరకు నిర్వహించారు. ఈ ప్రక్రియలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉద్యోగి కేడర్‌ను బట్టి రోజుకు రూ.250, రూ.350, రూ.400 చొప్పున రెమ్యునరేషన్ ఇస్తారు. ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన 26 రోజులకు ఒక్కొక్క ఉద్యోగికి వారి కేడర్‌ను బట్టి రూ.6,500, రూ.9,100, రూ.10,400 చొప్పున ఇవ్వాలి ఉంది. అయితే ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ పూర్తై ఆరు నెలలు గడుస్తున్నా సిబ్బందికి ఇప్పటికీ రెమ్యునరేషన్ చెల్లించలేదు. రావాల్సిన రెమ్యునరేషన్ గురించి ఎన్నికల విభాగానికి వెళ్లి అధికారులను అడిగితే వారి నుంచి సరైన సమాధానం రావడం లేదని విధులు నిర్వర్తించిన ఉద్యోగులు వాపోతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లని అధికారులు

ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ అంశాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి ఎన్నికల విభాగం అధికారులు తీసుకెళ్లలేదు.ఎఫ్ఎల్‌సీ చేసినప్పుడు కలెక్టర్‌గా ఎం. గౌతమి ఉన్నారు. ఆమె బదిలీపై వెళ్లారు. అటు తరువాత కలెక్టర్‌గా వి.వినోద్ కుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 5న బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఎఫ్ఎల్‌సీకి సంబంధించి చెల్లించాల్సిన రెమ్యునరేషన్ విషయాన్ని ఆయన దృష్టికి ఇప్పటివరకు అధికారులు తీసుకెళ్లలేదు. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల విధులు నిర్వర్తించిన వారికి రెమ్యునరేషన్ ఇచ్చే విషయంలో ఎన్నికల విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టమవుతోంది.



గత ఏడాది అక్టోబరు 16న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రారంభించి అధికారులకు సూచనలిస్తున్న అప్పటి కలెక్టర్ గౌతమి

విద్యార్థులు నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతి విద్యామందిరంలో వ్యక్తిత్వ వికాసంపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా మలచుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు.చరిత్ర పుటలలో తమకంటూ ఒక పేజీ ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. వివిధ రంగాల నిపుణులతో ఈ వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థులకు ఉచితంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రొఫెసర్ దౌలతాబాద్ మురళీధర్‌రావు, మాలపాటి శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ ఎంవీ రమణ, జగదీష్, బిసాతిభరత్, డాక్టర్ నాగేశ్వర రావు, శివప్రసాద్, ప్రొఫెసర్ రంగనాయకులు, సతీష్ తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హిమకర్, రామ్మూర్తి, బాబు, దివాకర్, మణిదీప్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

• పటేల్ రోడ్డు తెలుసా ?



నగరంలోని కోర్టు రోడ్డు

అనంతపురం కల్చరల్: పటేల్ రోడ్డు ఎక్కడుందో తెలుసా అని నగరవాసులెవరినైనా అడిగితే ఎక్కడో విన్నట్టుందే అని కాసేపు ఆలోచిస్తారు. పూర్వీకులకు తప్ప ఈతరం వారికి పటేల్ రోడ్డు గురించి ఏ మాత్రమూ అవగాహన లేదు. పటేల్ రోడ్డు, పైడి లక్ష్మయ్య రోడ్డు అంటూ మునిసిపాలిటీ (ఇప్పుడు నగరపాలక సంస్థ) వారు పేర్లు పెట్టినా కోర్టు రోడ్డు అనే పేరే అందరి నోళ్లలో నానుతోంది.

కోర్టు ఉండడంతోనే..

పటేల్ రోడ్డు లేదా పైడి లక్ష్మయ్య రోడ్డులో జిల్లా కోర్టు ఉండడంతోనే ఆ పేర్లు మరుగున పడిపోయాయనేది ఎవరూ కాదనలేని సత్యం. 1924కి ముందు జిల్లా కోర్టు బళ్లారిలో ఉండేది. ఆ తర్వాత కొన్నాళ్లకే 'అనంత'లో కోర్టును నిర్మించారు. అయితే, అప్పటికే ఈ రోడ్డుకు పటేల్ రోడ్డు లేదా పైడి లక్ష్మయ్య రోడ్డు అని నామకరణం జరిగిపోయింది. స్వాతంత్ర్య సమరయోధుడు పైడి లక్ష్మయ్య అప్పట్లో ఆ ప్రాంతంలో నివసించడంతో ఆయన గుర్తుగా పైడి లక్ష్మయ్య రోడ్డుగా నామకరణం చేశారు. పైడి లక్ష్మయ్య కాంస్య విగ్రహాన్ని రోడ్డు ప్రారంభంలో ఏర్పాటు చేశారు. అయితే, కాలం గిర్రున తిరగడం, కోర్టుకొచ్చే వారి సంఖ్య పెరగడం, ఎక్కడ ఉన్నావంటే కోర్టు వద్ద ఉన్నాననడం, కోర్టు రోడ్డులో ఉన్నాననడం అలా అలా కోర్టు రోడ్డుగానే అందరికీ సుపరిచితంగా మారిపోయింది. ఈ రోడ్డు పరిసరాల్లోనే గాస్పెల్ చర్చి, ప్రసిద్ధ వరదాంజనేయస్వామి ఆలయం, గుల్జార్‌పేట మసీదు ఉండడం గమనార్హం. ఒకప్పటి దేవదాయశాఖ మంత్రి పీవీ చౌదరి, అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన వేమారెడ్డి తదితరులు ఈ వీధిలో నివసించిన వారే.

బాల కార్మిక నిరోధక చట్టం లక్ష్యం నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

అనంతపురం: బాలకార్మిక నిరోధ చట్టం ప్రధాన లక్ష్యం నెరవేర్చడానికి అధికారులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివ ప్రసాద్ యాదవ్ అన్నారు. బుధవారం న్యాయ సేవా సదన్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ యాక్ట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బాల కార్మిక నిరోధానికి అధికారులు తమ శాఖలు నిర్దేశించిన బాధ్యతలను సమిష్టిగా నిర్వహించాలన్నారు. బాలల సంక్షేమ సంఘం సిఫార్సు చేసిన చిన్నారులను ఉంచే శిశు కేంద్రాలు, బాలికల పునరావాస కేంద్రాల్లో నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అభివృద్ధి చేయాలని అధికారులతో సూచించారు. జిల్లాలో చిన్నారుల సంక్షేమానికి చేపట్టే ప్రతి ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారాన్ని కోరవచ్చన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు మేడా రామలక్ష్మి, కార్మిక శాఖ, విద్య, ఆర్డీటీ, తదితర శాఖల సంస్థల అధికారులు పాల్గొన్నారు.

కడప, నెల్లూరు జట్ల విజయం



అర్జున్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును అందిస్తున్న దృశ్యం

అనంతపురం: సౌత్ జోన్ అండర్ –19 అంతర జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచుల్లో కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

- ఆర్డీటీ స్టేడియంలోని బీ గ్రౌండ్‌లో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు 40.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. చరణ్‌జిత్ 48 పరుగులతో రాణించాడు. శ్రీసాయిచరణ్‌రెడ్డి నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కడప జట్టు 24 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి విజయం సాధించింది. రణధీర్‌రెడ్డి 23 పరుగులు, టి. సుదర్శన్ 25 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఐదు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. సాయిచరణ్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను దక్కించుకున్నారు.
- నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి నెల్లూరు జట్టు బ్యాటింగ్ తీసుకుంది. నెల్లూరు జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. అర్జున్ 86 పరుగులు చేసి సత్తాచాటాడు. కే. ప్రసాద్ 58 పరుగులు చేసి రాణించారు. ఆక్షిత్‌రెడ్డి మూడు వికెట్లు, అశోక్ కుమార్, మోహిత్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 50 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 234 పరుగులకే పరిమితమైంది. 46 పరుగులతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. మనోజ్ రాజు 60 పరుగులు, విష్ణువర్ధన్ 35 పరుగులతో రాణించినా ప్రయోజనం లేకపోయింది. అర్జున్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

నాణ్యమైన భోజనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మల్లికార్జున

రాప్తాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారులు మల్లికార్జున, కుల్లాయప్ప సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో 'జగనన్న గోరుముద్ద' పథకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నదే జగనన్న గోరుముద్ద పథకం ఉద్దేశమన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అర్థం చేసుకుని మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. రుచి, శుచి, శుభ్రత తప్పకుండ పాటించాలన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయని, ఆ రోజు నుంచే పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. అనంతరం వాటిని ఏ విధంగా తయారు చేయాల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా చూపించారు. అక్కడే వంట నిర్వాహకుల చేత వంటను తయారు చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నారాయణ స్వామి, ఆదినారాయణ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ పద్మావతమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా ఉండాలి

ఆత్మకూరు: పాఠశాలల్లో మధ్యాహ్నం చిన్నారులకు అందించే భోజనం రుచిగా వండాలని ట్రైనర్ జయమ్మ, ఎంఈఓ రామాంజనేయులు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో భోజన ఏజెన్సీ నిర్వాహకులు, హెల్పర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, ఆ రోజు నుంచి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంట గదులు, సామగ్రి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వైభవంగా అక్కమ్మగార్ల పరుష



ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ దేవతలు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ఆలయం

- జనసంద్రంగా మారిన ఆత్మకూరు

ఆత్మకూరు: వరాల తల్లి అక్కమ్మ దేవత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పరుష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి నారికేళాలు సమర్పించారు. అనంతరం మొక్కుబడి ఉన్న భక్తులు పన్నీరపు బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. పరుషకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆత్మకూరు జన సంద్రంగా మారింది. మెయిన్ సెంటర్ నుంచి ఆలయం వరకూ భక్తులు పోటెత్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత



జేఎన్‌టీయూ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: ఈవీఎంలను భద్రపరిచిన జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. బుధవారం రాత్రి స్ట్రాంగ్‌రూంల భద్రతను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం పరిసరాల నుంచి మూడు కిలోమీటర్ల వ్యవధిలో డ్రోన్ల వినియోగాన్ని నిషేధించామన్నారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జేఎన్‌టీయూలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. సాయుధ పోలీసులతో నిరంతరం భద్రత కల్పించామన్నారు. పరిసరాల్లో ఫుట్ పెట్రోలింగ్, వజ్రవాహనం ద్వారా గస్తీ కొనసాగిస్తున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ముగిసే దాకా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్ రెడ్డి ఎస్పీ వెంట ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఈ సరస్వతి (పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్) హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 91 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి డీఈఈ సరస్వతి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సచిన్, కళాశాల సిబ్బంది, విద్యార్థి తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో ధ్వంసమైన ఎద్దుల బండి

బొమ్మనహాళ్: మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామం వద్ద పొలం పనులకు వెళ్తున్న ఎడ్ల బండిని అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొంది. బుధవారం ఉదయం రైతు మహేష్ ఎడ్ల బండిపైన వ్యవసాయ పనులకు వెళ్తున్నాడు. వెనుకవైపునుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఎడ్లబండి పూర్తిగా ధ్వంసమైంది. వ్యవసాయ కూలీ ముత్యాలు, ఒక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముత్యాలును చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ ప్రజాస్వామ్యం పరిహాసమవుతోంది

- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: ఎన్నికలొచ్చాయంటే ప్రజాస్వామ్యం నడి వీధిన పడుతూ పరిహాసం అవుతోందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు.జేవీవీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ కన్వీనర్ సురేష్ అధ్యక్షతన 'ప్రజాస్వామ్యం- ఎన్నికలు' అనే అంశంపై విస్తృతంగా చర్చించారు. డాక్టర్ గేయానంద్‌తో పాటు మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా, యూటీఎఫ్ నాయకులు జిలాన్, వివిధ సంస్థల ప్రతినిధులు రాజమోహన్, భాస్కర్ తదితరులు మాట్లాడారు. ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణం ఉండడం లేదన్నారు. డబ్బు కీలక పాత్ర పోషిస్తుండడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలి

- హిమాలయన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వేణుగోపాల రావు



వేణుగోపాల రావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలని అరుణాచల్ ప్రదేశ్‌లోని హిమాలయన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వేణుగోపాల రావు పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాల్లో రాణించాలన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఫర్ ద సొసైటీ ఆధ్వర్యంలో వీసీ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వేణుగోపాల రావు మాట్లాడుతూ బీసీలు ఉన్నత పదవులు సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సొసైటీ చైర్మన్ పోతుల రాధాకృష్ణ, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్, అబ్దుల్ రసూల్, బండారు శంకర్, సుబ్బన్న, సదాశివరెడ్డి, సురేష్, వరప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలు చేస్తే రౌడీషీట్

- ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక

చెన్నేకొత్తపల్లి: మండలంలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఎవరైనా హద్దుమీరితే కఠినంగా వ్యవహరిస్తామని చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఆ రోజు, ఫలితాల వెల్లడి తర్వాత మండలంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అల్లర్లు, ఘర్షణకు ప్రేరేపించే అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీట్ కూడా ఓపెన్ చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ కూడా చేస్తామన్నారు. మండల పరిధిలోని పెట్రోల్ బంకుల్లో లూజుగా డీజిల్, పెట్రోల్ విక్రయాలు నిషేధించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 6వ తేదీ వరకూ మండలంలో ఎక్కడా బాణాసంచా విక్రయించరాదని, వినియోగించరాదన్నారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ఫిజికల్ సైన్స్ పరీక్షకు 4,412 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లాలో 4,534 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 45 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8,946 మంది విద్యార్థులకుగాను 4,412 మంది గైర్హాజరయ్యారు. అధికారులు వివిధ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

బొమ్మనహాళ్: మండల పరిధిలోని అంకంపల్లికి చెందిన కౌలు రైతు గురుస్వామి సాగు చేసిన అరటి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం కాలిపోయింది. బాధిత రైతు గురుస్వామి తెలిపిన మేరకు.. ఏడు ఎకరాల్లో యాలక్కి రకం అరటి పంట సాగు చేస్తున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏడు ఎకరాల్లోని డ్రిప్ పైపులు కూడా కాలిపోయాయి. సుమారు రూ.13 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.